# రింగుల రాణి

సాయంత్రం అయిదు గంటలయింది. ఫిబ్రవరి చివరి వారం పొద్దు నిలిచింది గాని చలి ఇంకా తగ్గలేదు. మా ఇంటిఎదురు మామిడి బాగా పూతపూసింది. మామిడి దిగుబడి ఈ ఏడు బాగోవచ్చని రైతులన్నారు.

నాకు దిగులేసింది. మామిడి పూత నిలబడి, కాయలు కాస్తే, ఆ కాయలకోసం ఆకతాయిపిల్లలు రువ్వేరాళ్ళు మావాకిట్లోకి వచ్చి పడతాయి. ఆ చెట్టు ఉండే ఇంటి యజమాని పోయాడు. ఇల్లు పాడు పడింది. ఇక అదలించేవారెవరు? సాయంత్రం ఐదయిందన్నాను కదా. అప్పుడేస్కూలునుండి వచ్చి వీధి వరండాలో కుర్చీలో కూర్చుని పేపరు చూస్తూవుంటే, ప్రతీరోజులాగానే "అదిగదిగో అప్పుడే బైలు దేరింది" అంది పక్కింటావిడ మాశ్రీమతితో.

"ఈరోజూ బయలుదేరిందా?". మా శ్రీమతి.

"మీరెన్నిచెప్పండి. గుణం మానుతుందిటండి?. వాడు మంచంలో నేడో రేపో అన్నట్టుంటే ఎలా బైలుదేరిందో చూడండి. దాని పోకులు అదీను". ఆ మాటలు ఎవరి గురించోనాకు తెల్సు.

తల ఎత్తిచూశాను. మా వాకిలిముందు నుండి, భుజానవేనటీ బ్యాగు తగిలించుకుని, నడచిపోతోందామె. అందరి ఆడవాళ్ళ నడకలా ఉండదు. ఒక ప్రత్యేకత ఉంటుంది. మగాళ్ళను చూచి తప్పుకుని నడవదు. నా దారికి అడ్డురాకండి అన్నట్టు నడుస్తుంది. ఆమె ముక్కు కొద్దిగ పైకి ఎత్తినట్టు వుంటుంది. చూస్తే ఆమె ఎవరినీ లెక్కచేసే వ్యక్తికాదేమో అనిపిస్తుంది. పెద్దకళ్ళేగాని ఆ కళ్ళలోకి చూసేశక్తి ఎవరికీ ఉండదేమో అనిపిస్తుంది. ఆమెనందరు 'రింగులరాణి' అంటారు. నాలుగైదు సంవత్సరాల క్రితం ఖాదర్‌తో లేచి వచ్చేసిందామె.

ఖాదర్ తరపువాళ్ళు వచ్చి అతన్ని తీసికెడదా మనిచూసినా అతను వెళ్ళలేదు. ఆమె అంటే అతని కంత ప్రేమ.ఆమె సర్కస్‌లో 'రింగుల' మీద 'బార్సు' మీద ఫీట్సుచేసేదట. ఆమెనుచూసి ఇష్టపడి సర్కస్ ట్రూపుతో ఖాదర్ వచ్చేశాడట. కొంతకాలం ఆ ట్రూపులోనే ఉండి అక్కడ సరిపడక వేరే వచ్చేశారట. సర్కస్‌లో ఆమె రింగుల మీద ఫీట్సుచేసేదని తెలుసుకున్న మా ఊరిజనం ఆమెకు పెట్టినపేరు 'రింగుల రాణి'. ఆమె మా ఊరొచ్చిన కొత్తలో చెవులకు పెద్ద బంగారు రింగులే ఉండేవట. అవి ఇప్పుడు లేవు. అవేకావు మెడలో నెక్లెస్, చేతికి రెండు జతల గాజులు- అవి ఏవీ లేవిపుడు. అన్ని ఖాదర్ తాగుడికే పోయాయంటారు. నిజానికి ఖాదర్ తాగుతాడు. కొత్తలోలేని ఈ పాడలవాటు ఖాదర్‌కి రావడానికి ఒక కథే చెప్తారు.

రాణియే ఖాదర్‌ని పాడుచేసిందంటారు కొందరు, తన స్వేచ్ఛ కోసమని. నిజానికి ఒకరి జీవిత రహస్యాల్లోకి తొంగిచూడాల్సిన అవసరం మనకేమిటి అంటే మా సాంబమూర్తి ఒప్పుకోడు.

నేను స్కూలు నుండి వచ్చిన మరుక్షణమే నా ముందు వాల్తాడు. అతనుండేది

మా వీధి చివరే. ఖాదర్ ఇంటి ముందు ఇల్లే అతన్ది.వాళ్ళఇంట్లోజరిగే ప్రతీది అడిగినవాళ్ళకి, అడగనివాళ్ళకి చెప్తాడు. చివరగా మిగిలిపోయిన నన్ను వదలడు.

"ఈ సింగారి రోజూ సాయంత్రం అయిదయ్యేసరికి ఎక్కడికి పోతోందో గమనించాలి గురూ గారూ!" అన్నాడోసారి. "దానికన్నా, ఖాదర్‌చేత తాగుడు మాన్పిస్తే మంచిదేమో!" అన్నాను.

"మనం మానమన్నా వాడు మానడు. అది మాన నివ్వదు. అప్పుడు సర్కస్‌లో జంతువుల్ని ఆడించింది. ఇప్పుడు వీడ్ని ఆడిస్తోంది".

"ప్రేమించి అతనితో వచ్చిన స్త్రీ అలా చేస్తుందనుకోలేము". అన్నాను సాంబమూర్తితో.

"ప్రేమా!దోమా!మీ పిచ్చిగాని సర్కస రాణిగా దానిచుట్టు ఎందరు పోతుటీగలో. అందులో వీడొకడు. వీడుపోతే మరొకడు". అన్నాడతను.

ఉండలేక అడిగేశాను సాంబమూర్తిని "ఎందుకు ఆమె మీద నీకంత కసి?" అని.

"కసే గురువుగారూ! కొవ్వెక్కిన ఇలాంటి ఆడవాళ్ళంటే నాకు పడదు.ఖాదర్ని నాశనంచేసింది".

ఆమె ఎవరితోనూ తగవుపడటంగాని పరుషంగా మాటాడటంగాని నేను వినలేదు. ఖాదర్ తాగి రామమందిరం దగ్గరో, ఎలిమెంటరీ స్కూలు దగ్గరో రోడ్డు మీదో పడి ఉంటే, తానే ఊరంతా తిరిగి ఇంటికి తెచ్చిందనే విన్నాను. నిజానికి నన్నుబాధించిన విషయాలు రెండేరెండు. ఒకటి ఖాదర్ తాగుడికి బాని సవడం, రెండోది ఆమె గురించి చెడు వినాల్సిరావడం. అందుకే నేనూ అన్వేషణలో పడ్డాను.

ఓ రోజు సాయంత్రం హడావుడిగా వచ్చి సాంబమూర్తి "తెలిసింది గురూగారూ! తెలిసింది. రోజూ ఎక్కడికి పోతుందో చెప్పనా? ఇంటి నుండి రైల్వేస్టేషన్ కెళ్తుంది. ఎవరైనా వస్తారో, లేక కబురే వస్తుందో. ఈవెనింగ్ ఎక్స్‌ప్రెస్ ఎక్కేస్తుంది. బాగా డబ్బు సంపాదించుకుని ఏ రాత్రో తిరిగి వస్తుంది. టవున్లో మనవాళ్ళే బస్ స్టేషన్‌లోనూ, చూసినట్టు చెప్పారు". అన్నాడు.

"అలాగా!" అన్నాన్నేను. ఇంకేమన్నా ఏవేవో చెప్తాడు. నేను వినలేను.

కారణం...ఓ అయిదు సంవత్సరాలక్రితంమా ఊరొచ్చిన ఈ జంట ఇప్పటిలాగే అప్పుడు మావీధి చివర ఉండేవారు. సర్కస్ వదలివచ్చిన ఖాదర్‌కి మీసం మెలేస్తూ, కండలు చూపిస్తూ ఊళ్ళో తిరగడం తప్ప మరే పని ఉండేదికాదు.

ఇంటి ముందున్న చింతచెట్టు కింద బండరాయి మీద చిన్ననిక్కరు లాంటి డ్రాయరువేసుకుని ఖాదర్ కూర్చుంటే, అతని ఒంటికి నూనె పట్టించి రాణి మర్దనచేస్తూ ఒళ్ళుపట్టేది. ఆ దృశ్యాన్ని వీధిలో వచ్చే పోయేవారు చూసి ఆనందిస్తూంటే, తన కండలు తిరిగిన శరీర సౌష్టవాన్నే చూచి ఆనందిస్తున్నారను కునేవాడుగాని రాణి శరీర లావణ్యాన్ని ఒక కంట చూసి గుటకలు మింగే రసిక రాయుళ్ళున్నారని గ్రహించ లేకపోయేవాడు ఖాదర్.

తనకు వంగి నమస్కారాలు పెట్టేవారంతా తనకు భయపడినవారేనని, వారందర్నీ తాను రక్షిస్తున్నట్టు గొప్పగా ఫీలయ్యేవాడు ఖాదర్, 'వాడికి సిగ్గులేక పోయినా దానికైనా ఉండక్కరలేదూ! ఒళ్ళంతా కనిపించేలా ఆ వయ్యారాల ప్రదర్శన ఏమిటి వీధిలో'. అనుకునే మగవారు సైతం రాణితో మాటలు కలపడానికి ప్రయత్నిస్తూంటే తానొక మహారాజన్న ఊహల్లోకి వెళ్ళిపోయేవాడు ఖాదర్.

ప్రతీ ఏడాదిలాగే ఆ ఏడు గౌరీ పున్నమి పండుగ చేయసంకల్పించింది మా ఊరు. ఆ ఉత్సవాల్లో ఉత్సాహవంతులు విచిత్రవేషధారులై ఊరు అంతా తిరిగి ఆనందింపజేసేవారు. ఆ ఉత్సవాలకి బంధుమిత్రులు ఎక్కడినుండో వచ్చేవారు.

ఆ పండుగలో చివరిరోజున తాౡరాజు వేషం తప్పని సరిగా ఉండేది. అల్లూరి సీతారామరాజులాగా బ్రిటీష్ వారినెదిరించి, వారిని ముప్పతిప్పలు పెట్టినవీరుల్లో ఒకడు తాౡరాజు. అతన్ని బంధించడానికి విశ్వప్రయత్నం చేసింది ప్రభుత్వం.

కాని వారికది సాధ్యం కాలేదు. చివరికి తాౡరాజు దగ్గర విశ్వాసపాత్రుడిగా ఉండే సహచరుడి సహాయంతో అతన్ని బంధించగలుగుతుంది ప్రభుత్వం. ఎన్నో దశాబ్దాలుగా ఈ కథ మా ఊరిలో ప్రదర్శింపబడుతూనే ఉంది. తాౡరాజు వేషధారి ఊరంతా తిరగుతూ ప్రభుత్వానికి దొరక్కుండా ముప్ప తిప్పలు పెట్టే సన్నివేశం సుమారు మూడుగంటలు సాగుతుంది. తాౡరాజు ఆజానుబాహుడు. మహాబలిష్ఠుడు. నిమ్మకాయల్ని సైతం నిలబెట్టగల గుబురు మీసాలు, గిరజాల జుట్టు, నుదుటన ఎఱ్ఱనిబొట్టు- ఇదీ అతని రూప విలాసం.

ప్రతీ సంవత్సరం మా ఊరి కామందు వెంకట్రాయుడే ఆ తాౡరాజు వేషం వేసేవాడు. కాని ఆ సంవత్సరం ఏదో విఘాతం వచ్చి రాయుడు ఆ వేషం వేయలేక పోయాడు. ఆ అవకాశం ఖాదర్ కొచ్చింది. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు ఖాదర్. అసలే పొడవైన బలిష్ఠుడు, సాముగరిడీలు నేర్చినవాడేమో, ఊరివీధుల్లో మెరుపువేగంతో పరిగెడుతూ, చెట్లు, గుడిగోపురాలు ఎక్కుతూ, దూకుతూ, చేతనున్న చేవకఱ్ఱ గిరగిరాతిప్పుతూ ఊరంతటిని అలరింపజేశాడు.

మూడు గంటలకు ముగియాల్సినది అయిదు గంటల ప్రదర్శనైంది. 'వెంకట్రాయుడు ఎందుకు పనికివస్తాడ్రా ఖాదర్ ముందు? అసలు తాౡరాజు ఇలాగే ఉండేవాడేమో'. అని ఊరంతా చెప్పుకుంది. ఊరందరి ఆనందం ఒక ఎత్తయితే రాణిది మరొక ఎత్తు. భర్తను చూసి పొంగిపోయింది.

ఊరంతా అతడ్ని మహావీరుడిలా చూసింది. ఇది జరిగిన మూడో రోజునే 'అమ్మతల్లి' బలికోసమని వదిలేసిన 'ఎనుబోతు' కొవ్వి, ఊరిలో స్వైర విహారం చేస్తూంటే, దానికెదురెళ్ళి దాని రెండు కొమ్ములు పట్టి, దాని ధాటిని ఆపి, గొలుసులతో కట్టేసి దారికి తెచ్చాడు. ఇప్పటికీ అది ఖాదర్ని చూస్తే, బెరుకు చూపులతో నిలబడిపోయి, నెమ్మదిగా పక్కకెళ్ళిపోతుంది. ఈ సంఘటనతో ఖాదర్ వీరత్వం పక్క గ్రామాలకు పాకిపోయింది. 'నీవు ఏ పనిచేయొద్దు, మా ఊళ్ళో ఉండు చాలు. నిన్నుమేము పోషిస్తాం'. అని గ్రామస్థులు చేయూతనిచ్చారు.

'పని లేకపోతే మనిషి పిశాచమవుతాడు' అంటూ రెండెకరాల సాగుభూమిని సంపాదించుకుని వ్యవసాయం ప్రారంభించాడు ఖాదర్. టవున్ల చుట్టూ, సినిమాల

చుట్టూ తిరిగే యువకుల్ని కూడగట్టి వ్యాయామం, సాము గరిడీలు నేర్పడం మొదలు పెట్టాడు. అమ్మతల్లి పండుగలో ఘటాల ముందు నడిచాడు. రెండో ఏడాది గౌరీ పున్నమికి కూడా ఖాదర్‌నే తాట్రాజు వేషం వేయమన్నారు.

'తన్ను తోసి రాజన్నందుకు వెంకట్రాయుడు క్రోధంతో ఉడికిపోయాడు అసూయతో రగిలిపోయాడు. కుర్రకారు చేవకర్రలు తిప్పుతూ వెంటరాగా సైన్యం మధ్యనడిచే రాజులా తాట్రాజు వెలిగి పోయాడు. గత ఏడాదికన్నా మిన్నగా ఒప్పించాడు. మా గ్రామమే ఒక పెద్ద పట్టణమైంది.

చూసి ఆనందించినవారందరూ ఖాదర్ని ధన, వస్తు విశేషాలతో ఆరాత్రి సత్కరించారు. ఇదీ ఎంతో వెంకట్రాయుడ్ని రగిలించింది. ఆనాటి నుండే ఖాదరు పతనం మొదలైంది. ఖాదర్ ప్రతాపాన్ని మెచ్చుకుంటున్నట్టు నటిస్తూ వెంకట్రాయుడు, ఖాదర్ని గౌరవించి సత్కరించి, తనతోపాటు తిప్పుకుంటూ మద్యాన్ని అలవాటుచేశాడు. సీసాలకొద్దీ తాగుతూ దివాణంలాంటి వెంకట్రాయుడి భవనంలోనే రాత్రి పగలు పడుండేవాడు. టవునుకు తీసికెళ్ళిన వెంకట్రాయుడు 'ముద్దు గుమ్మల్ని' కూడా అలవాటు చేశాడు. 'రోగాలొస్తే వైద్యులున్నారులే' అంటూ హామీ ఇచ్చాడు. ఇంటిని పట్టకుండా దివాణంలో, టవున్లో గడి పేసేఖాదర్‌ని పట్టుకోడానికి రాణి ఊరు ఊరంతా తిరిగితనతో లాక్కొచ్చేది. అలవాటు పడ్డగొడ్డులా వేళకాగానే దివాణానికి పరుగులు తీసేవాడు. రెండు రాత్రులు పగళ్ళు అక్కడే తాగుతూ తిండితిప్పలు మాని ఉండిపోయాడు ఖాదర్. రాణి అతన్ని చూసి కంగారుపడింది. ఓ రోజు సారాతోపాటు ఏమి తాగాడోగాని రక్తం కక్కుకున్నాడు. మనిషి నీరసించిపోయాడు. ఖాదర్ బతకడట, అంటే మేం చూడడానికి వెళ్ళాం. 'తాగుడు మానకపోతే బతకడం కష్టం'. అనినాయుడు డాక్టరు ఇచ్చిన హెచ్చరిక, 'ఇలా తాగితే వేషమెలా కడతావు. పండుగ నెలరోజులే ఉంది'. అని పలువురు చేసిన హెచ్చరిక ఖాదర్ని ఇంటిపట్టునే ఉంచాయి.

కాని ఆ ఏడు జరిగిన గౌరీ పున్నమి పండుగలో అభాసుపాలైపోయాడు ఖాదర్. ఒక శవం నడిచి నట్టునడిచాడు. ముఖంలో మీసాలు తప్ప ఏమీ కని పించలేదు. గిట్టనివాళ్ళు కుళ్ళిన కోడిగుడ్లు కూడా విసిరారు. అవమానం భరించలేక ఖాదర్ నాటుసారా తాగి ఆ రాత్రి ప్రాణాల మీదికి తెచ్చుకున్నాడు. రాణి తన ఒంటిపై మిగిలిన నగల్ని అమ్మేసి టవునుకు తీసికెళ్ళింది. డాక్టర్లు ఏమి చెప్పారోగాని విచారంగా తిరిగి వచ్చింది.

ఆరోజు నుండి ఖాదర్ మంచం దిగలేదు. రాణి మాత్రం గడపదాటింది. ఎక్కడికెడుతుందోగాని రోజూ కాకపోయినా నాలుగు రోజులకొకసారైనా డబ్బు తెచ్చి మందులుకొని ఖాదర్‌కి వేస్తుంది.

"ఒకవేళ అది దారి తప్పిందేమోనండి". మా స్టాఫ్‌లో ఒకరి సంశయం.

"అయితే మాత్రం తప్పేమిటండి? మన పురాణల్లో భర్తల కోసం పాటుపడ్డ సుమతిలాంటి పతివ్రతలు లేరా?" ఒకరి సమర్థన. అది వెక్కిరింతలా ధ్వనించింది నాకు.

"నలుగురు ఆదుకుంటే ఆ తప్పుడు పనేదో ఆమె చేయదుగా". అని

నోరుజారాను.

"నలుగురి మాట ఎందుకు? వాళ్ళుమీ వీధిలోనే ఉంటున్నారు కదా. మీరే ఏదోవిధంగా ఆదుకోవచ్చుగా. ఆదుకోలేరు. ఎందుకంటే ఖాదర్ మీద అందరికీ ఒకప్పుడు గౌరవం, ఇప్పుడు సానుభూతి ఉన్నా, రాణి అంటే ఈ ఊరి ఆడవారందరికీ చిన్న చూపే, సర్కస్‌లోంచి వచ్చిందని. అంతేకాదు చూపుకు నదరుగా ఉంటుంది కూడా. అందుచేత ఏ మగాడు కాస్త ఆమెతో మాటకలిపినా ఏదో జరిగిపోయిందనే ప్రచారం చేసేలోకం ఇది. కాని ఒకమాట మాత్రంనిజం ఏ ఒక్క మగాడు ఖాదర్‌ని ఆదుకోవాలని ముందుకడుగేసినా పది మంది మద్దతుగా వచ్చి కలుస్తారు. అది నిజం". అన్నాడు డ్రాయింగ్ మాష్టరు. కుర్రాడైనా ఎంతబాగా చెప్పాడనిపించింది నాకు.

"ఆదుకోవడం అంటారేమిటండీ. ఉన్నది ఊడ పెరక్కుండా ఉంటే చాలు. సాగుకి భూమి ఇచ్చినా యన భూమి స్వాధీనం చేసుకున్నాడట. అద్దె ఇస్తే గాని ఇంట్లో ఉండనివ్వనన్నాడట సుబ్బరామయ్య. 'అడిగిందిస్తావా? అడిగిందిస్తాను' అన్నాడట ఒక మహానుభావుడు. రోగాలఇంట్లో బట్టలుతకనందట మణేలు భార్య...." ఇలాగే సాగింది మా చర్చ.

అరోజే నేను అనుకున్నాను ఖాదర్నిచూసి రావాలని సాంబమూర్తిని కూడగట్టుకోవడంచాలా మంచి దని.కానినేవెళ్ళేసరికి సాంబమూర్తి ఇంటికి తాళం వేసుంది. వెనక్కివెళ్ళడం ఎందుకని ఖాదర్ ఇంటిలో ప్రవేశించిన నాకు ఖాదర్ పక్కకుర్చీలో కూర్చున్న సాంబమూర్తి కనిపించాడు.

నేను ఆశ్చర్యంతో, "సాంబమూర్తీ!" అన్నాను. "కూర్చోండి...చెప్తాను". అన్నాడు.

నన్ను చూసి ఖాదర్ ఆనందించాడు. "పంతులుగారు వచ్చారు. చాలా మంచిరోజు. పంతులుగారూ! ఈ సారి పండగలకి వేషం కడతాను. అందరినీ మెప్పిస్తాను" అన్నాడు ఆయాసపడుతు. పోలిక పట్టలేనట్టు మారిపోయాడు ఖాదర్. లేచి కూర్చున్నాడుగాని కూర్చోలేక మంచంమీద వాలిపోయాడు. మనిషి పాలిపోయాడు. మీసాలు వాలిపోయాయి. అస్థిపంజరాన్ని దాస్తున్నట్టుంది వేసుకున్న చొక్కా.

"మందులు తెప్పించుకో ఖాదర్". అంటూ వంద రూపాయల నోటు చేతిలో పెట్టాను. ఆనందంగా అందుకుని అన్నాడు ఖాదర్ "అల్లా మిమ్మల్ని చల్లగా చూడాలి పంతులుగారూ. కాని దానికి మాత్రం చెప్పకండి".

అలా ఎందుకన్నాడో అర్థంకాక నేను అయోమయంగా సాంబమూర్తివేపు చూశాను. "భార్యకు చెప్పవద్దంటున్నాడు" అన్నాడతను. నేను బయలుదేరుతూంటే నా వెనుకేవచ్చాడు సాంబమూర్తి.

నేను అడగకముందే చెప్పాడు "ఖాదర్‌కి వాళ్ళ వాళ్ళనిచూడాలని ఉందిట. ఉత్తరం రాయమన్నాడు. రాశాను. కాని సమాధానంలేదు. మళ్ళీ ఇవ్వాళోరేపో రాయాలి. మీ సందేహం నాకు తెలుసు. రాణి అంటే నాకసహ్యంగాని ఖాదర్ మీద కాదు. రాణిమీద ఖాదర్ ప్రేమ చచ్చింది. తన వాళ్ళు వస్తే ఖాదర్ వెళ్ళిపోతాడు". అంటూ వివరణ ఇచ్చాడు.

నా బుర్ర తిరిగిపోయింది. అతను నాకు బాగా అర్థమయ్యాడు. అనుమానంతో ఇద్దరు పిల్లల తల్లి అయిన తన భార్యనే చంపచూసిన సాంబమూర్తికి ప్రేమ - మమత-అనురాగం ఏంఅర్థమవుతాయి! అతనినుండి భర్తనుకాపాడుకోమని రాణికి చెప్పాలి. కాని ఎలా? ఆ రాత్రి నాకు నిద్రపట్టలేదు.

ఆ మర్నాడే నాకు టవును వెళ్ళే పనిపడింది. పి.ఎఫ్.లోన్' డబ్బులు తెచ్చు కునేందుకు భోజనం చేసిబయలుదేరాను. సొమ్ముచేతిలో పడగానే మా శ్రీమతికి ఓ జత గాజులు కొనాలని ఆలోచన. నా పనులు నాతోటివారి పనులు పూర్తిచేసేసరికి చీకటి పడిపోయింది. నగలదుకాణంలోనే ఆలస్యమైంది.నే భయపడ్డట్టే మాఊరు వెళ్ళే చివరి బస్సు వెళ్ళిపోయింది. అప్పుడు బస్‌స్టేషన్‌లో ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టు నిలబడ్డ రాణి కనిపించింది.

- నవ్వు ముఖంతో "పదిగంటల బస్సువెళ్ళిపోయింది పంతులుగారు. ఇంకో అరగంటలో మనూరికి పాసింజరు రైలుంది. మీరు కనిపించారు. నాకు చాలా ధైర్యం వచ్చింది" అంది. ఎప్పుడూ మాట్లాడని ఆమె పలుకరించగానే ఏదో శంక.

రాణిని కలసి సాంబమూర్తి గురించి హెచ్చరించాలనుకున్న నేను ఆమె కనపడగానే తడబడ్డాను. రాణితో నన్నెవరైనా చూస్తే. గుండె అదిరింది.

"బస్సయితే ఊళ్ళోకి వెళుతుంది. కాని రైలు అయితే రెండు మైళ్ళు నడిస్తేగాని ఊరు రాదు. ఒక్కొక్కప్పుడు బస్సుతప్పిపోతే నేనలాగే చేస్తాను. పదండి వెళ్దాం" . అంది పరిచయం ఉన్నదానిలా. రాణితో కలసి ఇంత రాత్రివేళ ప్రయాణమా? రేపటికల్లా మా గురించి కథలు రావూ!

"రాత్రివేళ.. స్టేషన్ నుండి...అంత దూరం...."

"భయమేమి ఉండదు పంతులుగారూ. దారి బాగుంటుంది. పైగా వెన్నెల. ఆలోచిస్తూంటే ఈ రైలూ వెళ్ళిపోతుంది". అందామె.

ధైర్యం చేశాను. ఆమెకు దూరదూరంగా వెనక ముందులుగా స్టేషన్ చేరాను.

"కూర్మయ్యా! రైలు లేటా?"అడిగింది శనక్కాయలమ్ముకునే అతన్ని పిలిచి.

"లేదమ్మా! ఏమ్మా! బస్సు తప్పిందా? రాత్రికూడ అయిపోయిందే. పోనీ మాఇంటికి రారాదు. మీ వదినకి చెప్తాను". అన్నాడతను.

"లేదన్నా! పోవాలి ఎంతరాత్రయినా. మా బావకి ఒంట్లో బాగోలేదు. పైగా మందులు అందించాలి. ఇవ్వాళ వీటికోసమే లేటయింది". అంది.

"పోనీ...నేను తోడురానామ్మా?"

"వద్దులే అన్నా...పంతులుగారున్నారు. మా ఊరే... మంచివారు... నాకేం భయం".

"పోనీ... మనూళ్ళోనే మకాం పెట్టరాదమ్మా! రోజూ ఇలా తిరగడం..." . అన్నాడతను.

"ఈ కంపెనీ ఎన్నాళ్ళింకా ఉంటుందనీరాను. ఇంకోనెల ఉంటే గొప్ప. ఈలోగా నా రాజా లేచి తిరిగితే చాలు. నేనెన్ని బాధలైనా పడతాను".

"ఎంత కష్టపడ్డా ఫలితం ఉంటే అంతే చాలు. కాని పైసాపైసాకి లెక్కకడతారు"

"లేదన్నా! ఛార్జీలకి రోజూ ముప్పై ఇస్తున్నారు. కలక్షన్ బట్టి వారం వారం మూడు వందలనుండి ఐదువందలవరకు ఇస్తారు. ఇవ్వాళ ఇస్తామన్నవాళ్ళు వాయిదా వేశారు. వారంలో ఏ ఒక్కరోజు మానేసినా పెద్ద కోతపెడతారు.రెండు షోలు ఆడాల్సిందే".

లైన్ క్లియర్ అవగానే కూర్మయ్య మా ఇద్దరికీ టిక్కెట్లు తెచ్చాడు. రైలు రాగానే నేను ఎక్కిన పెట్టే ఎక్కింది రాణి. నేనుకూర్చున్నానుగాని నా ఆలోచనలన్నీ 'కంపెనీ...షోలు...కలక్షన్...ఆడటం...' మీదే.

"బాబుగారూ! మా చెల్లెమ్మని జాగ్రత్తగా తీసికెళ్ళండి". అని చెప్పి రైలు దిగాడు కూర్మయ్య.

'రాత్రి వేళల్లో నీవుచేసే ఉద్యోగం ఏమిటి?' అని రాణిని అడిగేయాలని అనిపించింది. కాని ఎలా? ఎలా? అడిగినా నిజం చెప్తుందా?

రైలు బయలుదేరింది. నేను గొంతు సవరించుకుని "అడుగుతాను ఏమనుకోవుకదా. రోజూ నీవు వచ్చి ఇక్కడ చేసే ఉద్యోగం..."

"ఊరంతా చెప్పుకుంటున్నారే. మీరు వినలేదా? నేను వ్యభిచారంచేయడానికి రోజూ వస్తున్నానని".

"అది నిజంకాకపోతే నాకెంతో ఆనందంచెప్తే సంతోషం". అన్నాన్నేను రాణితో.

"చెప్తాను...ఎవరికైనా చెప్పాలి కదా. నేను పని చేసిన సర్కస్ కంపెనీయే ఈ ఊర్లో రెండునెలలుగా ఆడుతోంది. నేను రోజూ మొదటిఆట చివరలోను, రెండో ఆట మొదట్లోను 'బార్సు' మీద 'రింగుల' మీద ఫీట్స్‌చేస్తాను. ఎలాలేదన్నా నెలకి రెండు వేలు పైనే నాకు ముడుతుంది. నా రాజాని బతికించుకోవడం కోసం అది నాకు చాలు".

నాకు ఎంతో ఆనందం కలిగింది "ఈ విషయంలో రహస్యమెందుకు?" అన్నాను.

"నా మంచికే...నేను కులటనని, నా దగ్గర రోగాలున్నాయని ప్రచారం. అందువల్ల నా ఊసుఎవరూ పట్టరు. నాకు అదే రక్షణ". అంది.

"కానిఖాదర్‌కూడా నలుగురి మాటనమ్మితే".

"అదెప్పటికీ జరగదు. నా కోసం తన వాళ్ళందరినీ వదులుకున్నాడు. నేను తనకి అన్యాయం చేస్తానని ఎలా అనుకుంటాడు?"

"ఎవరైనా నమ్మించవచ్చు. అతని బంధువులెవరైనా వచ్చి అతన్ని తీసికెళ్ళి పోవచ్చు".

"ఊరంతా ఏకమైనా మమ్మల్ని ఎవరూ వేరు చేయలేరు". స్థిరంగా అంది రాణి.

అలా అన్న తరువాత ముణుకుల్లో తలదాచుకుని చాలా సేపుండిపోయింది. ఏడిచిందేమో నా అనుమానం. తను వద్దంటున్నా రైలు దిగిన తరువాత ఇంటివరకు దిగబెట్టాను.

మర్నాడు సాంబమూర్తిని పిలిచి "వీళ్ళను వేరు చేయాలని ఎందుకు చూస్తున్నావు"? అని అడిగాను. కన్నుగీటి ఒక విషపు నవ్వు నవ్వాడు సమాధానంగా. రోజూ రాణి గడప దాటగానే సాంబమూర్తి ఖాదర్ దగ్గరకొచ్చి చేసే నిర్వాకమేమిటో నాకర్థమైంది. రాణిమీద కతలల్లి చెప్పటం, ఖాదర్ మనసు చెడగొట్టటం-అంతకన్నా పనేముంది? నలుగురు కూడగట్టుకుని మేకను కుక్క అంటే కుక్కే నిజమవుతుంది. మంచంలో పడివున్న తనతో ఇక పనేముందని, తననొక పిచ్చివాడ్నిచేసి, తన విలాస జీవితం సాగిస్తోందని నమ్మే ఖాదర్-రాణి తనకోసం ప్రతిక్షణం ప్రమాదభరితమైన జీవనంసాగిస్తోందని ఎలా నమ్మగలడు? ఆమె చెప్పినా నమ్మడు.

స్కూలు అయిపోగానే రోజూ, ఖాదర్ ఇంటికి చేరి సాంబమూర్తి ఆటలు అడ్డుకోవాలని ప్రయత్నించిన నేను మూడోరోజునే భంగపడ్డాను.

"....పంతులుగారూ! మీరు రోజూ వస్తున్నారు కాని, అది ఈ సందెవేళ ఇంటికాడుండదు. టవున్లో ఉంటాది. ఆడికేఎల్లండి. నాకాడేటుంది? నే సచ్చిన శవాన్ని...". ఖాదర్ మాటలు వినలేక వస్తుంటే నా వెనకొచ్చిన సాంబమూర్తి "నేచెప్పలే. దానిమీదవీడి ప్రేమ చచ్చింది. నేడోరేపో గోరీ కట్టాలి". అన్నాడు.

ప్రతీరోజులా ఇంటికిచేరే రాణి ఆరాత్రి ఇంటికి చేరలేదు. నేను కంగారుపడ్డాను.

"అది ఎవడితోనో....." అరిచాడు ఖాదరు. మర్నాడు సెలవుపెట్టి, నేను, డ్రాయింగ్ మాష్టరు టవునువెళ్ళి, సర్కస్ కంపెనీకెళ్ళాము. అక్కడ తెలిసింది. గత రాత్రి రింగులమీద ఆడుతూ జారిపడిందని, ఎడమచేతికి ఫ్రాక్చర్ అయి హాస్పిటల్‌లో ఉందని. మేము హాస్పిటల్‌కి పరుగెత్తాం.

మమ్మల్ని చూసి కన్నీరు పెట్టుకుని "నేను నేడో రేపో వచ్చేస్తాను. రాజాని కంగారుపడొద్దని చెప్పండి. రాజా తిండితిప్పలు..." అంది.

మేము కూడపలుక్కునీ ఖాదర్‌ని హాస్పిటల్‌కి తేవడానికి టాక్సీ తీసికెళ్ళాం. టాక్సీ శబ్దంవిని "ఎవరొచ్చారుబాబు...నారాణి ఏది బాబు?... దానికేటయింది బాబు? చెప్పండి బాబు?" అంటూ పడుతూ లేస్తూ ఎదురొచ్చాడు ఖాదర్. జరిగిందంతా చెప్పి "నీ రాణిని చూస్తావా? టాక్సీ ఉంది". అన్నాం.

ఖాదర్‌గొల్లుమన్నాడు. వచ్చీరాని నడకతో టాక్సీ ఎక్కాడు. దారంతా ఏడుస్తూనే ఉన్నాడు.

"నన్ను బతికించడం కోసం నీవు చావాలా? నీ కన్నా నేనే ముందు పోవాలనుకుంటున్నానే... నీవు లేకపోతే నేనెట్టా బతకాల. నా ఊపిరెట్టా ఆడుద్ది... రాణి అమాయకురాలు బాబు. ఒట్టి పిచ్చిది..." ఖాదర్ ఏడుపుతోపాటు మా టాక్సీ ముందుకు సాగింది.

ఒక్కమాట చెప్పాలి. సాంబమూర్తి మాతోపాటు హాస్పిటల్‌కి రాలేదు. కొరకంచూలా ముఖంపెట్టుకుని అక్కడే ఉండిపోయాడు.

★ ★ ★